RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :186 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 21 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 186 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 21 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు



వర్గల్ - ప్రభాత సూర్యుడు : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువుతో పాటు కరెంట్ కష్టాలు వస్తాయని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు వచ్చే ప్రభుత్వంలో సర్వ హక్కులు కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 2లో

### పది రోజులుగా

## సొరంగంలోనే..

- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- చిక్కుకున్న కార్మికులకు పైప్ ద్వారా ప్రత్యేక ఆహారం
- సీఎంతో మాట్లాడిన ప్రధాని మోడీ



డెహ్రాడూన్ - ప్రభాత సూర్యుడు

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో కూలిన టన్నెల్‌లో చిక్కుకున్న 41 మంది కార్మికులు పది రోజులుగా (మంగళవారం నాటికి) మృత్యువుతో పోరాడుతూనే ఉన్నారు. వారిని కాపాడేందుకు మరో నాలుగైదు రోజులు పట్టే అవకాశం కనిపిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ వారు సురక్షితంగా వస్తారో, రారోనన్న ఆందోళనతో వారి కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. కార్మికులు ఉన్న చోటకు ఆరు అంగుళాల వెడల్పు ఉన్న ప్రత్యామ్నాయ పైపు చేరుకున్నట్లు ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ డైరెక్టర్ అన్షు మాన్సిష్ తెలిపారు. లోపల ఉన్న కార్మికుల ఆహార అవసరాలు తీర్చడానికి ప్రత్యేక

మిగతా 2లో



## ఇందిరమ్మ రాజ్యంలోనే.. వెలుగులు

### రోడ్ షోల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

ఖైరతాబాద్- ప్రభాత సూర్యుడు

'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి. బైబై కేసీఆర్ బైబై..' అనే నినాదాలతో రేవంత్‌రెడ్డి కార్యకర్తల్లో జోష్ పెంచి బహిరంగ సభను హోరెత్తించారు. సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు రేవంత్‌రెడ్డితో గొంతు కలిపి నినాదాలు చేశారు. నర్సాపూర్ విజయభేరి సభకు జనం భారీగా తరలి రావడంతో రేవంత్‌రెడ్డి జోష్ పెంచారు. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్వహించిన విజయభేరి సభలో, పరకాల, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో రోడ్ షోల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇందిరమ్మ రాజ్యమంటే చీకటి రాజ్యమంటూ కేసీఆర్ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ఇందిరమ్మ రాజ్యమంటే దేశానికి వెలుగులు నింపిన రాజ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఇందిరమ్మదేనన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్‌గా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా కేసీఆర్‌కు అవకాశమిచ్చింది కూడా కాంగ్రెస్సే అన్నారు. సోనియమ్మ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ నాంపల్లి దర్గా దగ్గరో.. బిర్లా టెంపుల్ మెట్ల కిందో బిచ్చమెత్తుకునే వారని విమర్శించారు. కాంగ్రెస్‌ను తిడితే ప్రజలిచ్చే తీర్పుతో కొట్టుకుపోతావని హెచ్చరించారు. అన్నారం బ్యారేజీ పగిలిపోయింది.. మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. తెలంగాణలో రాజరికం అరాచకం రాజ్యమేలుతోందన్నారు. మూడు వేల వైన్స్‌లు, 60 వేల బెల్ట్ షాపులు పెట్టి తెలంగాణను తాగుబోతులకు అడ్డాగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకొచ్చాక అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు.

కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలిస్తే నమ్మక

మిగతా 2లో



## మణిపూర్ పర్యటన ప్రధాని షెడ్యూల్‌లోనే లేదు


న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

మణిపూర్‌ను సందర్శించడం ప్రధాని షెడ్యూల్‌లోనే లేదని కాంగ్రెస్ ఆదివారం ధ్వజమెత్తింది. అహ్మదాబాద్‌లో జరిగిన క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌కు హాజరయ్యేందుకు ప్రధానికి సమయం దొరికింది కానీ, ఇప్పటికీ మణిపూర్‌లో సందర్శించలేదని కాంగ్రెస్ మండిపడింది. దీంతో ప్రధాని మోడీ ప్రాధాన్యతల గురించి స్పష్ట మైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేశారు. వరల్డ్‌కప్ మ్యాచ్ కోసం ఆదివారం గుజరాత్ వెళ్లారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తెలంగాణ, రాజస్తాన్‌లలో కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీయడం ప్రారంభిస్తారు. కానీ ఇప్పటికీ ఉద్రిక్తతలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో సందర్శించడం మాత్రం ఆయన షెడ్యూల్‌లో లేదని, దానికి ప్రాధాన్యతనివ్వలేదని విమర్శించారు.

## బాబుకు భారీ ఊరట

- 'స్కిల్'కేసులో పూర్తి స్థాయి బెయిల్
- సిఐడి ఆరోపణలకు ఆధారాల్లేవు
- ప్రధాన కేసు జోలికి వెళ్లడం లేదు
- తుది తీర్పు ఎసిబి కోర్టు ఇవ్వాలి
- బెయిల్ ఉత్తర్వుల్లో హైకోర్టు

మిగతా 2లో




## కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అధోగతే..

### - రోడ్‌షోల్లో మంత్రి కేటీఆర్

యాదగిరిగుట్ట- ప్రభాత సూర్యుడు

ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. ఒకే ఒక్కసారి అవకాశం ఇవ్వండని కాంగ్రెస్ నాయకులు వేడుకుంటు న్నారని.. కానీ ఇప్పటికి 11సార్లు ప్రజలు అవకాశం ఇచ్చినా ఏం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, భువనగిరి అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు


మిగతా 2లో



### మూడేళ్లుగా

## ఏం చేస్తున్నారు?

- తమిళనాడు గవర్నర్ రవికి సుప్రీంకోర్టు సూటి ప్రశ్న




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా మూడేళ్లుగా ఏం చేస్తున్నారని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. బిల్లులను ఉద్దేశపూర్వకంగానే గవర్నర్లు తొక్కిపడుతున్నారని తమిళ నాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశాయి. పంజాబ్ పిటిషన్‌పై గత వారం విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం సోమవారం తమిళనాడు, కేరళ పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్డివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం తమిళనాడు గవర్నరు తీరుపై సీరియస్ అయింది. 2020లో అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఎటూ తేల్చకుండా మూడేళ్లుగా ఎందుకు తొక్కిపట్టారని నిలదీ సింది. నవంబర్ 10న నోటీసు జారీ చేసిన తర్వాతే, పది బిల్లులను తమిళనాడు గవర్నరు ఈ నెల 13న వెనక్కి పంపడాన్ని

మిగతా 2లో

## భూమాత కాదు.. అది భూమేత

### ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



కరీంనగర్-- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే తెస్తామంటున్నది భూమాత కాదు.. అది భూమేత అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ధరణికి బదులు భూమాత పోర్టల్ పెడతామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, దానివల్ల దళారీల, పైరవికారుల రాజ్యం వస్తుందని చెప్పారు. ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. కేసీఆర్ కన్నా దొడ్డుగా ఎత్తుగా ఉన్న వాళ్ళు చాలామంది ముఖ్యమంత్రి అయ్యారు.. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న నల్లగొండ జిల్లాకు కనీసం మంచినీళ్లు ఇవ్వలేదని అన్నారు. నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఇంకా తీరలేదని, నా దత్తత ఇంకా అయిపోలేదని, బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అది కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మానకొండూర్, స్టేషన్‌ఘనపూర్, జనగామ, నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడారు. కరీంనగర్‌తో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ నడ్డివిరుస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఆటోకార్మికుల పన్నులను రద్దు చేశామని, ఇప్పుడు కూడా వారు ఏడాదికి కడుతున్న ఫిట్‌నెస్ చార్జీలనూ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలో ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్నమే లేదని, తినేందుకు సరిగా తిండిలేక, పశువులకూ గడ్డి లేక తెగనమ్ముకున్నామని వివరించారు. రైతుబంధును పుట్టించిందే కేసీఆర్ అని, రైతు ఎక్కడా అప్పు చేయకుండా పంట పెట్టుబడి ఇస్తున్నదీ తామేనన్నారు. ప్రగతి వైపు నిలుస్తారా? లేదంటే మునుపటి దౌర్భాగ్య రోజులు తేస్తామంటున్న కాంగ్రెస్ వైపు ఉంటారా? అన్నది ఆలోచించుకోవాలన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెబుతున్నారని, ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీ, ఎన్‌కౌంటర్లు జరగడం, మంచినీరు, కరెంటు లేకపోవడమేనా ? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం సక్కగుంటే ఎన్టీఆర్ ఎందుకు పార్టీ పెట్టిండన్నారు. రూ. 2లకే కిలో బియ్యం ఎందుకిచ్చిండ్రు ? అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదల కడుపులు నింపారని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి చెందిన ఒగ్గు కళాకారుడు చుక్కా సత్తయ్య 58 బోర్లు వేసినా ఇక్కడ చుక్క నీళ్లు పడలేదన్నారు. 'కడియం'కు టిక్కెటిచ్చినమని, ఎమ్మెల్యే రాజయ్యను చిన్నచూపు చూడమని, మంచి పదవిలో వుంటారన్నారు. 'ఈ ఎన్నికల్లో మనం వేయబోయే ఓటే వచ్చే ఐదేండ్ల మన తలరాతను మారుస్తుంది. మాయమాటలు ఎవరు చెబుతున్నారు? ప్రగతి బాటను ఎవరు చూపుతున్నారో? విచక్షణతో ఆలోచించాలి. పదేండ్లలో ప్రగతిబాట వేసుకున్నాం.. మళ్లీ అధికారంలోకి రాగానే ఆటోలకు ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తాం..' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

### పది రోజులుగా
## సొరంగంలోనే..

(మొదటిపేజీ తరువాయి)
ఆహారం కోసం వైద్య నిపుణులను సంప్రదించినట్లు చెప్పారు. సోమవారం మూంగ్ కిచిడీని ఈ పైప్ ద్వారా పంపామని చెప్పారు. తొలుత మూత ఉన్న సీసాల్లో పండ్లతో పాటు తేలికపాటి భోజనాన్ని సొరంగంలో చిక్కుకున్న కార్మికులను అందిస్తామని తెలిపారు. కార్మికులతో సంప్రదింపులు జరిపేందుకు చార్జర్‌తో కూడిన ఫోన్ కూడా పంపనున్నట్లు వివరించారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) కూడా రెస్క్యూ ఆపరేషన్‌లో భాగమైంది. 20, 50 కిలోల బరువున్న రెండు రోబోలను కూలిన సొరంగం లోకి పంపింది. లోపల చిక్కుకున్న కార్మికుల పరిస్థితిని ఈ రోబోలు అంచనా వేసి, రెస్క్యూ ఆపరేషన్‌కు సహకరిస్తాయి. అంతర్జాతీయ టన్నెలింగ్ నిపుణుల బృందం సోమవారం సంఘటనా స్థలానికి చేరింది. ఇంటర్నేషనల్ టన్నెలింగ్, అండర్‌గ్రౌండ్ స్పేస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్నాల్డ్ డిక్స్ ఆధ్వర్యంలో ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది.

**సిఎంతో మాట్లాడిన ప్రధాని మోడీ**

కార్మికులను కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాల గురించి తెలుసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామితో మాట్లాడారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. కేంద్రం నుండి అవసరమైన సాయం అందు తుందని హామీ ఇచ్చారని సిఎంఓ కార్యాలయం తెలిపింది. లోపల చిక్కు కుపోయిన కార్మికుల మనోధైర్యం దిగజారకుండా చూడాల్సిన అవసరం కూడా వుందని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర సంస్థల సమన్వయంతో కార్మికులను త్వరగా కాపాడేందుకు కృషి చేస్తామని సిఎం హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అధోగతే..

(మొదటిపేజీ తరువాయి)
భాస్కర్‌రావు గెలుపు కోరుతూ రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కష్టాలు పడ్డారని చెప్పారు. మళ్లీ ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, వెంకటరెడ్డి, జానారెడ్డి సన్నాసులు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రజలంతా రాష్ట్ర పరిస్థితిని ఆలోచించి అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. రాష్ట్రంలో 24గంటల కరెంట్ రావట్లేదని అంటున్న కాంగ్రెస్ నేతలు మిర్యాలగూడ మండలంలోని ఏదైనా గ్రామానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకొని.. వస్తుందో రాట్లేదో తెలుసుకోవాలని సూచించారు. ఎద్దు, వ్యవసాయం తెలియనోడు రేవంత్‌రెడ్డి అని, క్లబ్‌లు, పబ్‌లు మాత్రమే ఆయనకు తెలుసని అన్నారు. రైతుల బాధలు తెలియనోడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో యాదగిరిగుట్ట ఎలా ఉంది ఇప్పుడు ఎలా ఉందో చూస్తే సరిపోతుందని తెలిపారు. యాదగిరిగుట్ట కొండపైకి ఆటోలు వెళ్లే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ప్రధానమంత్రి మోడీ ఆడబిడ్డలకు అన్యాయం చేశారని, రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200 చేశారని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రాగానే రూ.400కే సిలిండర్ ఇస్తామన్నారు.

## ఫార్మాతో ప్రమాదకరం



యాచారం- ప్రభాత సూర్యుడు

ఫార్మా కంపెనీతో ఈ ప్రాంతంలో గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదముందని సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య సోమవారం యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నంలో ప్రచారం నిర్వహించారు. యాచారం, మంచాల మండలాల్లో బైక్ ర్యాలీ తీశారు. యాచారం మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన సభల్లో పి.మధు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడాయని తెలిపారు. పదేండ్లలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ఫార్మా పేరుతో రైతుల భూములను గుంజుకున్నారన్నారు. ఫార్మా పేరుతో బీఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారని, ఆ డబ్బుతోనే ప్రజల ఓట్లను కొనాలని చూస్తున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కమ్యూనిస్టుల ఓట్లతో గెలిచి రియల్ ఎస్టేట్ పేరుతో కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీతో ఈ ప్రాంత గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా బాధిత రైతులంతా ఎర్ర జెండాకు ఓట్లేసి అండగా నిలబడాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దని సూచించారు. ఈ ప్రాంతంలో భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది పేద ప్రజలకు ఎర్రజెండా భూములను పంచిపెట్టిందని గుర్తు చేశారు. ప్రజలంతా ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.భూపాల్, స్కైలాబ్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు బి.మధుసూదన్‌రెడ్డి, ఆలంపల్లి నరసింహ, పి.అంజయ్య పాల్గొన్నారు.

# బాబుకు భారీ ఊరట

అమరావతి - ప్రభాత సూర్యుడు

స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పూర్తి స్థాయి బెయిల్‌ను హైకోర్టు సోమవారం మంజూరు చేసింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు ఈ నెల 16న హైకోర్టు తీర్పు రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. బెయిల్ మంజూరు చేయాలన్న అనుబంధ పిటిషన్‌పై సోమవారం తామిచ్చిన తీర్పులో కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. గతంలో కంటికి శస్త్ర చికిత్స నిమిత్తం మధ్యంతర బెయిల్ పొందిన చంద్రబాబుకు ఈ సారి పూర్తి స్థాయి బెయిల్ లభించింది. మధ్యంతర బెయిల్ సందర్భంగా జారీ చేసిన బెయిల్ బాండ్ ఆధారంగా ఆయనను విడుదల చేయాలని న్యాయమూర్తి ఆదేశాల్లో పేర్కొన్నారు.

గతంలోని షరతులను కూడా సడలించారు. సడలింపు ఉత్తర్వులు ఈ నెల 29 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పింది. వైద్య నివేదికలను ఈ 7 నుంచి 28వ తేదీ లోపు రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు కాకుండా విజయవాడ ఎసిబి కోర్టులో నివేదించాలని ఆదేశించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబుకు బెయిల్ ఇచ్చేందుకు ఎసిబి ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

'2021లో కేసు నమోదుకు ముందే సిఐబి 140 మందికి పైగా సాక్ష్యులను విచారించింది. 4 వేల పేజీల పత్రాలను సేకరించింది. చంద్రబాబు పిఎ పెండ్యాల శ్రీనివాస్ సిఐడి ఎదుట హాజరుకాలేదనే కారణం పిటిషనర్ బెయి ల్ మంజూరుకు అడ్డంకి కాబోదు. మధ్యంత బెయిల్ ఉత్త ర్వుల తర్వాత పిటిషనర్ సాక్షులను ప్రభావితం చేశారనే అభియోగాలు కూడా సిఐడి చేయలేదు. సాక్ష్యాలను తారుమారు చేసినట్లు కూడా ఆరోపించలేదు. దర్యాప్తును అడ్డుకున్నట్లుగా కూడా సిఐడి వాదించలేదు. ఈ పరిస్థి తుల్లో పిటిషనర్ చంద్రబాబు పూర్తి స్థాయి బెయిల్ మం జూరు చేస్తున్నాం' అని ఉత్తర్వుల్లో ధర్మాసనం పేర్కొంది.

'బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా పూర్తిస్థాయి సాక్ష్యాన్ని పరిశీలించాల్సిన అవసరం లేదు. ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయా లేదా అన్నది మాత్రమే చూడాలి. మళ్లించిన రూ.370 కోట్లను చంద్రబాబు నగదు రూపంలో తీసుకున్నారనేందుకు ఎలాంటి ఆధారాలను చూపలేదు. 2014 జూన్ 1 నుంచి .2018 డిసెంబర్ 31 వరకు బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలను బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్‌ల నుంచి తీసుకున్నట్లు సీఐడీ చెప్పింది. ఈ దశలో నిధులు తిరిగి తెలుగుదేశం బ్యాంకు ఖాతాలకు చేరాయని తుది నిర్ణయానికి రాలేం. నిధుల మళ్లింపు విషయంలో సిఐడి. ప్రాథమిక ఆధారాలను సమర్పించలేదు. సీమెన్స్‌కు చెందిన సుమన్ బోస్, డిజైన్ టెకు చెందిన ఖన్వీల్కర్ మధ్య వాట్సాప్, ఎస్ఎంఎస్ మెసేజ్‌ల్లో కరెన్సీ నోట్ల నెంబర్లు స్కిల్ కేసుకు సంబంధించనవి అని చెప్పేందుకు ఆధారాలు కూడా లేవు.' అని ధర్మాసనం తెలిపింది.

అయినప్పటికీ ప్రధాన కేసును విజయవాడ ఎసిబి కోర్టు సిఐడి అభియోగాలపై విచారణ జరిపి తీర్పు చెప్పాల్సివుంది' అని హైకోర్టు పేర్కొంది. 'సీమెన్స్ కు నిధుల విడుదలపై ఆర్థిక శాఖ అభ్యంతరం చెప్పినప్పటికీ నాటి సీఎం ఆదేశాల మేరకు సీఎస్ నిధులు విడుదల చేసినట్లుగా సీఐడీ అభియోగం. అయితే ఈ తరహా అధికారం సీఎంకు లేదని సీఐడీ చెప్పడం లేదు. నిధుల విడుదల చేసినంతమాత్రాన అవినీతి జరిగినట్లుగా భావించేందుకు వీల్లేదు. పిటిషనర్ పాత్ర ఉన్నట్లు కాదు. సబ్ కాంట్రాక్టర్ల ఎగవేతకు చంద్రబాబును బాధ్యుడిగా చేయడం సరికాదు. షౌజయత్ ఖాన్ అనే వ్యక్తి సీఐడీ ముందు ఇచ్చిన వాంగ్మూలం, సీమెన్స్ ఎండీ మాథ్యు థామస్ ఈడీ ముందు ఇచ్చిన వాంగ్మూలాల్లో ఎక్కడా కూడా నేరంలో పిటిషనర్ పాత్రకు ఆధారాలు చూపలేదు.

ఈ దశలో పిటిషనర్‌కు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తున్నాం.' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'అయితే, ప్రధాన కేసు జోలికి వెళ్లడం లేదు. మినీ ట్రయల్ నిర్వహించాల్సిన అవసరం లేదు. అంతిమంగా కింది కోర్టు నిర్ణయించాలి.

– ఇది పూర్తిగా కోర్టు విచక్షణపై ఆధారపడిన ఉత్తర్వులు. పిటిషనర్ మినహా మిగిలిన నిందితులందరికీ ఇప్పటికే బెయిల్/ముందస్తు బెయిల్ మంజూరు అయ్యింది. దీనిని కూడా దృష్టిలో పెట్టుకుని పిటిషనర్‌కు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తున్నాం. 'అని బెయిల్ ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు.

# మూడేళ్లుగా ఏం చేస్తున్నారు?

(మొదటిపేజీ తరువాయి)
ధర్మాసనం ప్రస్తావిస్తూ,, నవంబర్ 10న తాము ఘాటుగా మందలించిన తరువాతే గవర్నరు ఈ పని చేశారు. ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు ఆయన ఎందుకు స్పందించరు?" అని అటార్నీ జనరల్ (ఎజి) ఆర్. వెంకటరమణిని ఉద్దేశంచి సిజెఐ డివై చంద్రచూడ్ ప్రశ్నించారు.దీనికి ఎజి వెంకటరమణి స్పం దిస్తూ... రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి గవర్నర్ అధికారాల ఉప సంహారణ బిల్లులకు సంబంధించినవి మాత్రమే వివాదం అని, ఇది ఒక ముఖ్యమైన అంశం కాబట్టి, కొంత పున రాలోచన అవసరమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో మూడేళ్ల క్రితం పంపినవి కూడా ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. గవర్నర్ కార్యాలయానికి ఏ బిల్లు ఎప్పుడు వచ్చినదీ తేదీలతో సహా వివరాలు తమ దగ్గర ఉన్నాయని కోర్టు పేర్కొ ప్రస్తుత గవర్నర్ ఆర్ఎన్ రవి నవంబర్ 2021లో బాధ్యతలు స్వీకరించారని ఎజి అనగా, ఏదేమైనా గవర్నర్ ఆలస్యం చేశారా? లేదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. తమిళనాడు అసెంబ్లీ మళ్లీ బిల్లు లను ఆమోదించి పంపింది. గవర్నర్ ఏం చేస్తారో చూ ద్దాం అంటూ తదుపరి విచారణను డిసెంబరు ఒకటో తేదీ కి వాయిదా వేసింది. తమిళనాడు రాష్ట్రం తరపున సీని యర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ అభిషేక్ సింఘ్వీ కోర్టులో తమ వాదనలు వినిపించారు. గవర్నరు గత వారం వెనక్కి బిల్లులు పంపేటప్పుడు దానికి కారణాలేవీ తెలపలేదన్న విషయాన్ని వారు కోర్టు దృష్టికి తీసు కొచ్చారు. పున్ణపరిశీలనకు బిల్లులను పంపేటప్పుడు వాటికి కారణాలను ఒక నోట్ రూపంలో తెలియజేయా లని రాజ్యాంగ నిబంధనలు చెబుతున్నాయని, అయితే, గవర్నర్ కేవలం "నేను ఆమోదం నిలుపుదల చేస్తున్నాను" అని ఒక్క ముక్క మాత్రమే పేర్కొన్నారని వారు తెలిపారు.

**బిల్లును సభకు పంపకుండా గవర్నర్ సమ్మతి నిలుపుకోగలరా?**

విచారణ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులకు సంబంధించి గవర్నర్‌కు ఉన్న అధికారాలను కూడా ధర్మాసనం పరిశీలించింది. "ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు మూడే ఆప్షన్స్ ఉంటాయని, ఆయన వద్దకు వచ్చిన బిల్లులకు ఆమోదం తెలపడం, పున్ణపరిశీలనకు వెనక్కి పంపడం, రాష్ట్రపతికి నివేదించడం. అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిల్లులను పున్ణపరిశీలన కోసం గవర్నరు వెనక్కి పంపాల్సి వస్తే వీలైనంత త్వరగా ఆ పనిచేయాల్సి ఉంటుందని, లేకుంటే అది రాజ్యాంగ నిబంధనలను అపహాస్యం చేయడమేనని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. తమిళనాడు ప్రభుత్వం తరపు మరో సీనియర్ న్యాయవాది పి. విల్సన్ వాదనలు వినిపిస్తూ గవర్నర్‌ను నిరవధికంగా బిల్లులను నిలుపుదల చేయడానికి అనుమతిస్తే, పాలన స్తంభించిపోతుందని అన్నారు. అదీగాక గవర్నర్‌కు అటు వంటి అధికారమేదీ రాజ్యాంగం ఇవ్వలేదని పేర్కొన్నారు. బిల్లును సభ మళ్లీ ఆమోదించిన తర్వాత గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపగలరా? అని సిజెఐ ప్రశ్నించగా, అటువంటి అవకాశమే లేదని సీనియర్ న్యాయవాదులు సింఘ్వీ, రోహత్గీ ఏకగ్రీవంగా బదులిచ్చారు. "గవర్నర్ రవి ఇంతకుముందు కూడా చాలా ఆలస్యం తరువాత నీట్ మినహాయింపు బిల్లును వెనక్కి పంపారు. అసెంబ్లీ మళ్లీ బిల్లును ఆమోదించిన తరువాత మాత్రమే దానిని రాష్ట్రపతికి పంపారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం కోరుతూ వచ్చిన బిల్లుపై ఆయన ఇదే వైఖరిని అవలంబించారు" అని తెలిపారు. గవర్నర్ కార్యాల యా నికి మొత్తం 181 బిల్లులు వచ్చాయని, వాటిలో 152 బిల్లు లకు ఆమోదం లభించిందని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఇందిరమ్మ రాజ్యంలో వెలుగులు

(మొదటిపేజీ తరువాయి)
ద్రోహం చేసి పదవుల కోసం శత్రువు పంచన చేరిన సునితమ్మను అసెంబ్లీ గేటు దాటనీయొద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఆమె గెలుపు కోసం ప్రచారం చేసిన తనపై రెండు కేసులయ్యాయని, అవి ఇప్పటికీ నడుస్తున్నాయని అన్నారు. నమ్మక ద్రోహం చేస్తే సొంతవాడైనా.. ఆడబిడ్డైనా బండకేసీ కొట్టాల్సిందేనన్నారు. తాము వచ్చాక నర్సాపూర్ నియోజకవర్గంలోని గిరిజనుల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్యాకేజీ ఇస్తామన్నారు. నర్సాపూర్ సభలో కాంగ్రెస్ అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, అంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు చిలుముల సుహాసినీరెడ్డి, కనకారెడ్డి పాల్గొన్నారు. ఈనెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల తరువాత కేసీఆర్, కేటీఆర్‌కు ఇక సెలవేనని రేవంత్‌రెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గ పట్టణ కేంద్రంలోని వెల్లంపల్లి రోడ్డు పరిసర ప్రాంతంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి సారథ్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. పరకాలను అగ్నిగుండంగా మార్చింది కేసీఆర్, చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా నిధులు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. కొండా దంపతులు అంటే తనకు బలమన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన ఇనుగాల వెంకటరాం రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్యకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)
అధికారంలోకి వస్తే పేదల భూములను గుంజుకుంటుందని ప్రతిపక్ష నాయకులు జూటా మాటలు చెబుతున్నారన్నారు. నీళ్లు, 24 గంటల కరెంటు, పేదల కోసం వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది సీఎం కేసీఆర్‌యేనని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే గ్రామాలలో కేసీఆర్ వేసిన రోడ్లకు గతుకులు వస్తే డాంబర్‌తో కూడా నింపరన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత భూములకు విలువ పెరిగిందన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ. 600 పెన్షన్ మాత్రమే ఇస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 2వేల పెన్షన్ ఇస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 2వేల పెన్షన్ ఎక్కడైనా ఇస్తున్నారా ఈటల రాజేందర్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ రాక ముందు గజ్వేల్ ప్రాంతం ఎలా ఉందో, కేసీఆర్ గజ్వేల్ వచ్చిన తర్వాత ఎలా ఉందో ప్రజలు గుండె మీద చేయి వేసుకొని ఒకసారి ఆలోచించాలన్నారు. ఎక్కడో ఉన్న గోదావరి జలాలను తీసుకొచ్చి కాళ్ళు కాడిగింది వాస్తవం కాదా అన్నారు.

సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడవసారి సీఎంగా రికార్డు సృష్టిచబోతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీపీ లతరమేష్, ప్యాక్స్ చైర్మెన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సంపాదకీయం

# మాంద్యంలోకి ఐటీ ఇండస్ట్రీ..?

భారతీయ టెక్ ఉద్యోగులకు ఇప్పుడిప్పుడే లేఆఫ్ హీట్ తగులుతోంది. చాలా దేశాల్లో ప్రఖ్యాత కంపెనీలు గత ఏడాది చివరి నుంచే ఎడాపెడా ఉద్యోగులను తొలిగించి ఖర్చులను తగ్గించుకున్నాయి. పరిస్థితులు మరింతగా దిగజారుతున్న వేళ కంపెనీలు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. గడచిన రెండేళ్లుగా టెక్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతూనే ఉన్నాయి. చాలా కంపెనీలు అధిక జీతాలు అందుకుంటున్న, అనేక సంవత్సరాలుగా తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులను సైతం వదులుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 2.5 లక్షల మంది టెక్కీలను ఇళ్లకు పంపేశాయి. ఇది గత ఏడాది నమోదైన తొలగింపుల కంటే 50 శాతం అధికం. ముందుగా గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి కంపెనీలు తొలగింపులను ప్రారంభించగా చివరికి ఆ ప్రభావం స్టార్టప్ కంపెనీలను కూడా తాకింది. గతవారం నాటికి 1,106 కంపెనీలు 2,48,974 మంది ఉద్యోగులను తొలగించాయి. గత ఏడాది 1,54,336 మందిని ఇదే సమయంలో టెక్ కంపెనీలు లేఆఫ్ చేశఆయి. ప్రధానంగా రిటైల్ టెక్, కన్స్యూమర్ టెక్ రంగాల్లో ఉద్యోగుల తొలగింపులు ఎక్కువగా నమోదయ్యాయి. అయితే ఏడాది ముగిసే నాటికి తొలగింపులు ఇంకా ఉంటాయని తెలుస్తోంది. ఈ క్రమంలోనే అమెజాన్ తాజాగా తన అలెక్సా విభాగంలో ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఇక భారతీయ టెక్ కంపెనీల విషయానికి వస్తే సరైన డీల్స్ లేక కంపెనీలు డీలా పడ్డాయి. మరో పక్క నియామకాలను సైతం దాదాపుగా నిలిపివేశాయని ఇటీవలి త్రైమాసిక ఫలితాలను అన్వేషించగా వెల్లడైంది. పైగా బెచ్ పై ఉద్యోగులు ఎక్కువగా కొనసాగటం.. ఖర్చులను తగ్గించుకునేందుకు వేతన పెంపులను వాయిదా వేయటం, కొన్ని విభాగాల ఉద్యోగులకు హైక్స్ నిరాకరించటం వంటి చర్యలతో ప్రస్తుతానికి ఉపశమనం పొందుతున్నాయి. అయితే ఈ ధోరణి ఇలాగే మరికొన్ని త్రైమాసికాలు కొనసాగితే ఇండియాలో సైతం టెక్ కంపెనీలు ఉద్యోగుల కోతలకు వెళ్లక తప్పని పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.త ఏడాదితో పోల్చితే ఉద్యోగుల కోతలు 40 శాతం మేర పెరిగినట్లు నివేదిక హైలైట్ చేసింది. దీన్నిబట్టి 2023లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్పష్టమవుతోంది. టెక్ రంగం నుంచి మాంద్యం సంకేతాలు ఉన్నందున.. అనేక కార్యాలయాలు మూతపడ్డాయి. 2022లో టెక్ కంపెనీలు 1,64,744 మంది ఉద్యోగుల తొలగించాయి. గణాంకాల ప్రకారం 2023లో ఉద్యోగాల కోతల సంఖ్య పెరిగింది. కేవలం జవవరి ఒక్క నెలలోనే 75,912 మంది టెక్కీలు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఫిబ్రవరిలో 40,000 మంది.. ఆ తర్వాత మూడు నెలల కాలంలో దాదాపు 73,000 మంది తొలగించబడ్డారు. తర్వాత దాదాపు 24 వేల మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదులుకోవాల్సి రావటంతో గత వారం వరకు మె?త్తం 2,26,117 తొలగింపులు నమోదయ్యాయి. కరోనా తర్వాత ప్రపంచ ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా మారటంతో.. 2021 నుంచి టెక్ కంపెనీలు మూడేళ్ల కాలంలో 4 లక్షల మంది టెక్ ఉద్యోగులను తొలగించాయి. అనిశ్చిత ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, సరఫరా గొలుసు అంతరాయాలు, ఆదాయ వృద్ధి మందగించడం ఉద్యోగాల కోతలకు ఆజ్యం పోశాయి. ఈ క్రమంలో గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలు తొలగింపుల్లో ముందు వరుసలో నిలిచాయి. ఈ వాతావరణంలో ఇండియన్ టెక్ కంపెనీలు హైరింగ్ ఫ్రీజ్ కొనసాగిస్తున్నాయి. ప్రాజెక్టులు లేక అధిక సంఖ్యలో ఉద్యోగులు ఖాళీగా ఉండటంతో ఆందోళన చెందుతున్నాయి.మెజాన్ లేఆఫ్స్ కొనసాగిస్తోంది. గత కొన్ని నెలలుగా అనేక ఏఐ కార్యక్రమాలను అమలు చేస్తున్న అమెజాన్..కస్టమర్ సమీక్ష నుంచి డెవలపర్, దాని ఏడ్బ్లూ ఎస్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో వారి సొంత ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అమెజాన్ తన ప్రముఖ వాయిస్ అసిస్టెంట్ అలెక్సాను నిర్వహించే యూనిట్ లో వందలాది ఉద్యోగులను తొలగిస్తోంది. ఉద్యోగులకు లేఆఫ్స్ నోటీస్ విడుదల చేసింది.కస్టమర్ల కు మరిన్ని సేవలు, ఏఐ పై ఎక్కువ దృష్టి సారించడంతో కంపెనీకు చెందిన కొన్ని కార్యక్రమాలను పూర్తి తొలగించాం..అందులో పనిచేసే ఉద్యోగులను కూడా తొలగిస్తున్న అమెజాన్ అలెక్సా ఫైర్ టీవీ వైస్ ప్రెసిడెంట్ డేనియల్ చెప్పారు. ఎన్ని ఉద్యోగాలు తొలగిస్తున్నారు అనేది స్పష్టం గా తెలపలేదు. ఇది అమెరికా, కెనడా, భారత్ లోని ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని చెప్పారు.ఉత్పాదక ఏఐ క్రేజ్ ను ఉపయోగించుకునేందుకు ఇతర కంపెనీలతో సీటెల్ ఆధారిత అమెజాన్ పోటీ పడుతోంది. గత కొన్ని నెలల్లో అనేక ఏఐ కార్యక్రమాలను అమలు చేస్తోంది. టెక్నాలజీ సమీక్ష, డెవలపర్, దాని ఏడ్బ్లూ ఎస్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో వారి సొంత ఏఐ సాధనాలను రూపొందించేందుకు అనుమతించే సేవలను అందించడం వరకు ఏఐ ని విస్తృతంగా వాడుతోంది.

# పోరాటలతోనే సబ్ ప్లాన్ చట్టం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర జనాభాలో 15.45 శాతం ఎస్సీలున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వీరు అట్టడుగున ఉన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులను మాత్రమే కేటాయించేది. ఆ నిధులను కూడా దళితుల అభ్యున్నతికి ఖర్చు పెట్టేది కాదు. దీంతో వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంతో పాటు మేధావులు, ఇతర 102 సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సబ్‌ప్లాన్ చట్టం కోసం నిర్విరామ పోరాటాలు చేశాయి. బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ తదితరులు నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. పోరాటాల ఉధృతికి తలవంచిన ప్రభుత్వం..సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం ద్వారా బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటయింది.ఎస్సీ అభివృద్ధి నిధికి కేటాయించిన నిదులు సుమారు 54 శాఖల ద్వారా ఖర్చు చేసే యంత్రాంగం ఉండేది. ఈ ఏడాది ఖర్చు చేయని నిధులను మరుసటి సంవత్సరం ఖర్చు చేసే విధంగా క్యారీ ఫారవడ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నాడు ప్రభుత్వం ప్రకటించింది. పోరాటం ఫలితంగా సాధించిన గొప్ప విజయమిది.

# ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్నిప్రమాదం

- 36 బోట్లు పూర్తిగా, 9 పాక్షికంగా దగ్ధం
- సుమారు రూ.15 కోట్లు ఆస్తి నష్టం
- బోట్ల విలువలో 80 శాతం నష్టపరిహారం : సిఎం ఆదేశం
- బాధిత మత్స్యకారులను పరామర్శించిన పలు పార్టీల నేతలు
- అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



గ్రేటర్ విశాఖ - ప్రభాత సూర్యుడు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 36 బోట్లు పూర్తిగా, తొమ్మిది బోట్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. వీటిలో మెకనైజ్డ్ బోట్లు కూడా ఉన్నాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లి వచ్చిన బోట్లను చేపల రేవులోని జెట్టీల వద్ద మత్స్యకారులు నిలిపి ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి మొదట వీటిలో ఒక బోటుకు నిప్పు అంటుకుని పక్కపక్కనే ఉన్న బోట్లుకు అగ్ని కీలలు వేగంగా వ్యాపించడంతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో గాలులు అధికంగా వేయడం, వేలాది లీటర్ల డీజిల్, గ్యాస్ సిలిండర్లు బోట్లలో ఉండడంతో ప్రమాదం తీవ్రత అధికంగా ఉంది. పెద్ద ఎత్తున పేలుళ్లు సంభవించాయి. హఠాత్తు ఘటనతో మత్స్యకారులు హడలిపోయారు. వారు హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక అధికారులు, నేవీ సిబ్బంది ఐఎన్ఎస్ సహారా షిప్ ద్వారా నీళ్లుజల్లి త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టడంతో ఉదయం ఆరు గంటలకు మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.15 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని, ఒక్కో బోటు ఖరీదు రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో బోట్లలోని వలలు కూడా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, తక్కువ స్థలంలో ఎక్కువ బోట్లు ఉండడం వల్లే ప్రమాదం భారీగా జరిగిందని తెలిపారు.

**ఆదుకోవాలంటూ మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళన**

తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని కోరుతూ ఫిషింగ్ హార్బర్ వద్ద మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడికి స్వయంగా వచ్చి పరిస్థితిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తీరు వల్ల ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మత్స్యకార మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో నష్టపరిహారం, రెండు నెలల పాటు ఉపాధి జీవనభృతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ప్రమాదంపై భిన్న కథనాలు**

ఈ అగ్నిప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి కొంతమంది మత్స్యకార యువకులు హార్బర్‌లోని చేపల వేలం పాట వేసే ప్రదేశంలో మందు పార్టీ చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. ఆరుగురు మందు తాగుతున్న క్రమంలో మాటామాటా పెరిగి కొట్లాడుకుని ఫిషింగ్ బోట్లను తగుల బెట్టారని ప్రచారం జరుగుతోంది. వీరిలో యూట్యూబర్ నాని కూడా ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని, యూట్యూబర్ దానిని వీడియో తీసే ప్రయత్నం చేశాడని చెబుతున్నారు. పూర్తి వివరాలు మంగళవారం నగర పోలీస్ కమిషనర్ వెల్లడిస్తారని పోలీసులు తెలిపారు. ఫిషింగ్ హార్బర్‌లో ఆకతాయిల ఆగడాలు కూడా నిత్యకృత్యంగా మారాయి. దీంతో, ఇక్కడి వ్యవహారాలపై గతంలో వన్‌టౌన్ ఏరియాలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మహిళా అధికారి నిఘా పెట్టి అణచివేశారు. అనునిత్యం పెట్రోలింగ్ చేస్తూ ఎవ్వరినీ దగ్గరకు చేరనీయకుండా చూసేవారు. దీంతో, కొద్ది నెలల పాటు మందు పార్టీలు ఆగాయని తెలుస్తోంది. ఆమె బదిలీ కావడంతో గడిచిన నెల రోజులుగా ఆకతాయిలు చెలరేగిపోతున్నట్లు మత్స్యకార కుటుంబాలకు చెందిన పెద్దలు కొంతమంది 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గెలిచిన తర్వాత తమ సమస్యలేవీ పట్టించుకోవడం లేదని, బోట్లకు సరిపడా స్థలం కోసం విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానిక మత్స్యకార మహిళలు తీవ్ర స్థాయిలో శాపనార్థాలు పెట్టారు. ఈ ప్రమాదం వల్ల రూ.కోట్లలో నష్టం జరగడమే కాకుండా బోట్లపై ఆధారపడిన వందల మంది కుటుంబాలకు రెండు, మూడు నెలల పాటు వేట అవకాశం లేకపోవడంతో జీవనోపాధిపై తీవ్ర దెబ్బ తగలనుంది.

**ప్రమాదంపై అధికారులతో సిఎం సమీక్ష**

విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో బోట్లు కోల్పోయిన వారికి బోటు విలువలో 80 శాతాన్ని నష్టపరిహారంగా చెల్లించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ ప్రమాదంపై తాడేపల్లిలో సిఎంఒ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. సమగ్ర విచారణ చేయాలని అధికారులను, ప్రమాదస్థలానికి వెళ్లి బాధిత మత్స్యకారులకు అండగా నిలవాలని మంత్రి సీదిరి అప్పలరాజును, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**రెండు, మూడు రోజుల్లో పరిహారం : మంత్రి సిదిరి అప్పలరాజు**

సంఘటనా స్థలాన్ని మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు సోమవారం పరిశీలించారు. ఘటనకు కారణాలు తెలుసుకోవడానికి దర్యాప్తు వేగవంతం చేశామని, అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే మత్స్యకారుల్లో ఇప్పుడు ఆందోళన నెలకొందన్నారు. అందరికీ ఒకేలా నష్టం జరగలేదని, జరిగిన నష్టంపై అధికారులు అన్ని విధాలా అంచనాలు వేస్తున్నారని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.

**పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం**

అగ్నిప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులను సిపిఎం, సిపిఐ, వైసిపి, టిడిపి, జనసేన పార్టీ, ఆప్ పార్టీల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ ప్రతి బోటుకూ నూరు శాతం నష్టపరిహారం చెల్లించాలని, ఈ బోటుపై ఆధార పడిన కుటుంబాలతోపాటు దీని ఆధారంగా ఉపాధి పొందుతున్న సుమారు వెయ్యి కుటుంబాలకు ప్రభుత్వం కనీసం మూడు నెలల వరకు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బోటు ఖరీదే కాకుండా బోటులో ఉండే సరుకు, డీజిల్, ఇతర సామగ్రిని కూడా పరిగణలోకి తీసుకొని పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు ఎటువంటి భద్రతా చర్యలు లేకపోవడం, సముద్రంలోని బోట్లను మంటల నుంచి రక్షించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. మెరైన్ పోలీస్ వ్యవస్థ లేకపోవడం, జెట్టీ విస్తరణ కాకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువుల సంఘటనా స్థలాన్ని పరిశీలించి బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మత్స్యకారుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా ఉందని, బోట్లకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని టిడిపి, జనసేన పార్టీ నాయకులు విమర్శించారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం : ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ విమర్శించారు. హుదూద్ తుపాను సమయంలో సుమారు 40 వరకు బోట్లు జెట్టీల సమీపంలో సముద్రంలో మునిగిపోయాయని, వీటిని తొలగిస్తే జెట్టీల వద్ద ఖాళీ ఏర్పడి బోట్లను దూరదూరంగా పార్కింగ్ చేసుకునే అవకాశం ఉండేదని తెలిపారు. బోట్లు దూరదూరంగా ఉంటే ప్రమాద తీవ్రత ఈ స్థాయిలో ఉండేది కాదన్నారు. సముద్రంలో మునిగిపోయిన బోట్లను తొలగించాలని తాము అనేకసార్లు కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారులను కోరామని, ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. సముద్రంలో మునిగి ఉన్న బోట్లను ఇప్పుడైనా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

**బోట్ల విలువలో 80 శాతం నష్టపరిహారం విచారణ చేపట్టాలి : పవన్ కల్యాణ్**

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టాలని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంలో నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు తక్షణమే జీవన భృతి అందించాలని, భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతాపరమైన అంశాలపై సమీక్షించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## -116 కౌంటింగ్ కేంద్రాలు ఎల్బీనగర్‌లో అత్యధికంగా 48 మంది పోటీ -గజ్వేల్‌లో 44, కామారెడ్డిలో 39 మంది

# 59,779 బ్యాలెట్ యూనిట్లు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59,779 బ్యాలెట్ యూనిట్ల (బీయూ) ను (ఈవీఎమ్)ను వినియోగిస్తున్నది. వీటిలో అత్యధికంగా ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,719 బీయూలను వినియోగిస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ మూడు బీయూలు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకంటే ఇక్కడి నుంచి అత్యధికంగా 48 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆ తర్వాతి రెండు, మూడు స్థానాలు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు పోటీచేస్తున్న గజ్వేల్, కామారెడ్డి ఉన్నాయి. గజ్వేల్‌లో 44 మంది పోటీలో ఉండగా 963 బీయూలను ఏర్పాటు చేస్తున్నారు. కామారెడ్డిలో 39 మంది పోటీచేస్తున్నారు. ఇక్కడ 798 బీయూలు వినియోగిస్తారు. అయితే ఓటర్లు అత్యధికంగా ఉన్న మల్కాజ్‌గిరిలో 33 మంది పోటీచేస్తున్నారు. ఇక్కడ 1,287 బీయూలు అవసరమని ఎన్నికల సంఘం లెక్కతేల్చింది. ఆ తర్వాతి స్థానంలో ఓటర్లు ఎక్కువగా ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో 22 మంది పోటీచేస్తుండగా, 1,168 బీయూలు అవసరమవుతున్నాయి. పోలింగ్ స్టేషన్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు, అవసరమైన ఈవీఎమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు సహా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. 119 నియోజకవర్గాలు, 33 జిల్లాల్లో మొత్తం 116 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం ఈవీఎమ్‌లు భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూంలనూ ఎన్నికల సంఘం అధికారులు పరిశీలించారు.



## ఈవీఎం బ్యాలెట్ పత్రంలో చిన్నగా సీతక్క ఫొటో..

### - అర్ధరాత్రి ధర్నా

ములుగు – ప్రభాత సూర్యుడు

ములుగు కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క గత అర్ధరాత్రి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎం బ్యాలెట్ పత్రంలో ఆమె ఫొటో మిగతా అభ్యర్థుల కంటే చిన్నగా ఉండడమే అందుకు కారణం. ఎందుకిలా ఉందంటూ అంతకుముందే ఎన్నికల అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం రాకపోవడంతో అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి బైఠాయించారు. సమాచారం అందుకున్న ములుగు ఎస్పై వెంకటేశ్వర్ కార్యాలయానికి చేరుకుని సీతక్కను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే తప్ప అక్కడి నుంచి కదిలేది లేదని సీతక్క భీష్మించుక్కూచున్నారు. దీంతో స్పందించిన రిటర్నింగ్ అధికారి అంకిత్ మరో ఫొటో ఇవ్వాలని సీతక్కను కోరారు. వెంటనే కాంగ్రెస్ నాయకులు మరో ఫొటో ఇస్తే తీసుకున్న ఆయన బ్యాలెట్‌పై దానిని ముద్రిస్తామని చెప్పి వెళ్లిపోయారు. అయితే, ఆయన హామీలో స్పష్టత లేదంటూ కాంగ్రెస్ నాయకులు తమ నిరసన కొనసాగించారు. తెల్లవారుజామున 2 గంటల వరకు సీతక్క ధర్నా కొనసాగింది. విషయం తెలిసిన రేవంత్‌రెడ్డి సీతక్కకు ఫోన్ చేసి ఆరాతీశారు.

## ఆడిటోరియం స్లాబ్ కూలి ఇద్దరు కూలీలు మృతి



మొయినాబాద్ – ప్రభాత సూర్యుడు

ఇండోర్ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం కుప్పకూలి ఇద్దరు కూలీలు మృతిచెందాడు. మరో పది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం సురంగల్ రెవెన్యూ పరిధిలోని ఫైర్‌ఫాక్స్ టెన్నిస్ స్టేడియంలో ఆడిటోరియం నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణంలో బీహార్, కలకత్తాకు చెందిన 12 మంది కూలీలు పనిచేస్తున్నారు. పని చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఆడిటోరియం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో 12 మంది శిథిలాల కింద ఇరుక్కుపోయారు. ఇద్దరు కూలీలు బాబ్లూ(35), సునీల్ (30) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు, రెస్క్యూ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మరో పది మంది కూలీలను కూడా బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రంగా తెలిపారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

### - 65 కిలోల గంజాయి స్వాధీనం




చందానగర్ – ప్రభాత సూర్యుడు

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 65 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు శేరిలింగంపల్లి ఎక్సైజ్ కార్యాల యంలో జిల్లా డీపీఈఓ సత్యనారాయణ వెల్లడించారు. ఎన్నికల బందోబస్తు లో భాగంగా ఆదివారం రాత్రి శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద శంషాబాద్ , శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒరిస్సాలోని మల్కన్ గిరి నుంచి నగరానికి ట్రైన్‌లో గంజాయి రవాణా చేస్తున్న సూరజ్ నవనాథ్ యాదవ్ మహారాష్ట్రకు చెందిన యువకుడిని అదుపులోకి తీసుకున్నా రు. అతని వద్ద నుంచి 65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరే షన్‌లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, ఎస్ఐలు శ్రీనివాస్, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'పట్నం' గడ్డపై

# బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయం

- బిఆర్ఎస్ నాయకుడు దండెం రాం రెడ్డి
- కాంగ్రెస్ ను నమ్ముకుని మోసపోయా
- బిఆర్ఎస్ నేత దండెం రాం రెడ్డి ఆధ్వర్యంలో భారీ చేరికలు
- మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలని పిలుపు





అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు

గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయునిగా ఉంటూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికిని కాపాడుకుంటూ వచ్చానని, అలాంటి తనను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని నమ్మించి మోసం చేసిందని అన్నారు. కేటీఆర్ సమక్షంలో నూతనంగా బిఆర్ఎస్ పార్టీలో చేరిన దండెం రాం రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని దండెం యువసేన సభ్యులు, ఆయన వర్గీయులు, అభిమానులు, వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు సుమారు 2000 మందికి పైగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు క్యామ మల్లేశం సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కేంద్రంలోని ఇందిరా గార్డెన్ లో పార్టీ చేరికల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు వేల సంఖ్యలో రాం రెడ్డి వర్గీయులు, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించి పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి నూతనంగా బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంచి రెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, క్యామ మల్లేశం లు మాట్లాడుతూ.. పార్టీలోకి దండెం రాం రెడ్డి, ఆయన వర్గీయుల రాకతో పట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీలో కొత్త ఉత్సాహం మొదలైందని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం దండెం రాం రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే నమ్మక ద్రోహానికి పెట్టింది పేరని, ప్రజలని మోసం చేసిందే కాకుండా, పార్టీని నమ్ముకుని అంకితభావంతో పనిచేస్తున్న నాయకులను కూడా మోసం చేస్తుందని విమర్శించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని, ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు ఏ విధంగా నమ్ముతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేసి గెలిపిస్తే తమను తాము మోసం చేసుకున్నట్లేనని పేర్కొన్నారు.

**పట్నంలో మంచిరెడ్డి గెలుపు ఖాయం**

బిఆర్ఎస్ పార్టీలో చేరికల కార్యక్రమం సందర్భంగా బిఆర్ఎస్ నేత దండెం రాం రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో యువజన నాయ కునిగా పనిచేసి, అంచలంచలుగా ఎదుగుతూ ఇబ్రహీంపట్నం నియో జకవర్గంలో గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ ఉనికిని కాపా డుతూ వచ్చానని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల ఆదరణతో ఎమ్మెల్యే టికెట్ పొందే స్థాయికి ఎదిగానని.. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక, పట్నంలో తమ రాజకీయ భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారుతుందని మల్ రెడ్డి సోదరులు కాంగ్రెస్ అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించి తనకు వచ్చిన ఎమ్మెల్యే టికెట్ను 'యం ఫార్ములా'తో అడ్డుకొని ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియో జకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అరాచకాలు మొదల వుతాయని, అభివృద్ధి కుంటు పడుతుందని అన్నారు. జరగ బోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపు కోసం దండెం రాం రెడ్డి యువసేన, అభి మానులు కృషి చేస్తారని, ఆ దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పాశం అర్చన దామోదర్, వడ్డేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, తొండాపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు చెరుకూరి రేణుక జగన్, మాజీ అధ్య క్షుడు ఈదమ్మల బలరాం, మాజీ కౌన్సిలర్ దేశారం బాల కృష్ణ, గౌని భాస్కర్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి సత్తార్, నాయకులు పిల్లి నగేష్ యాదవ్, మైనార్టీ నా యకు డు ఇర్ఫాన్, యువజన నాయకుడు మొగుళ్ల జీవన్ రెడ్డి, బద్దం నిరంజన్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ పథకాలు అందాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలి
- వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్



మర్పల్లి – ప్రభాత సూర్యుడు

ఎన్నికల సమయంలో వచ్చి మాయ మాటలు చె ప్పే నాయకులను ప్రజలు నమ్మకుండా పనిచేసేవా రి ని గుర్తించి ఓటు వేయాలని వికారాబాద్ జిల్లా బీఆర్ ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలోని కొంషేట్ పల్లి, మొగిలి గుండ్ల, పట్లూర్, ఘనపూర్ గ్రామాల్లో జరిగిన ఎన్ని కల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మా ట్లాడుతూ ఎన్నికలవేళ ఆయా పార్టీల రాజకీయ నా యకులు ప్రజల ముందుకు వచ్చి మాయ మాటలు చె ప్పి ఓట్లు దండుకొని వెళతారే తప్ప పనులు చేయరని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలోని పల్లెల్లో అభివృద్ధి ప్రారంభమై ప్రజల సం క్షేమం మొదలైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభు త్వ పథకం అందని ఇల్లు లేదన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల గ్రామాల అభివృద్ధిని మరిచి వారి సొంత సం పాదనకు పాటుపడ్డారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పథకాల ను అందిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మకూడదన్నారు. కారు గుర్తుకు ఓటు వే సి మరోసారి క్టెసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కో రారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, బసవేశ్వర, తెలుగు తల్లి విగ్రహాలకు ఆయన పూల మాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఇందిరా అశోక్, కల్పనా శంకర్, జడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నాయబ్ గౌడ్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లేశం, డైరెక్టర్లు యాదయ్య, గౌస్, పట్టణాధ్యక్షుడు గఫార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య గౌడ్, నాయకులు గో పాల్ రెడ్డి, బట్టు రమేష్, యాదవ రెడ్డి, అశోక్, మో హన్, రాచన్న, వికాస్ కుమార్, తదితరులున్నారు.

## పీజీ కోర్సు తొలగించొద్దని విద్యార్థుల నిరసన

### - ప్రధాన రోడ్డుపై ఆందోళన



న్యాల్‌కల్– ప్రభాత సూర్యుడు

పీజీ కోర్సు తొలగించొద్దని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి)లో సోమవారం జరిగింది. ప్రభుత్వం మిర్జాపూర్(బి) ఓయూ పీజీ కళాశాలను ఎత్తేయడానికి కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు ఎన్ కిరణ్, శివకుమార్, నరసింహులు, నిఖిల్ మాట్లాడుతూ.. పీజీ చదువుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఈ కళాశాలలో అనలెటికల్ కెమిస్ట్రీ కోర్సును తొలగిస్తూ ఓయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఐదుగురు విద్యార్థుల అడ్మిషన్లను తొలగించారని చెప్పారు. పీజీ కళాశాలను పూర్తిగా ఎత్తేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పీజీ కోర్సును కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. విద్యార్థుల సమస్యలను కాలేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## పిల్లలలో శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి

- సైంటిస్ట్ రఘునందన్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి ఆధ్వర్యంలో బాలోత్సవం




మియాపూర్ – ప్రభాత సూర్యుడు

పిల్లల శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలని సైంటిస్ట్ రఘునందన్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, గచ్చిబౌలి ఆధ్వర్యంలో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్లానేటరీ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు రఘునందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే తాత్వాన్ని అలవర్చుకో వాలని అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రహాలు, గ్రహనాలపై ఉన్న అపోహలు తొలగిచుకోవాలని సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం పిల్లల్లో సృజ నాత్మకతను పెంచే కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా పిల్లలు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు 550 మంది పాల్గొన్నారు. భాద్యులు ఆర్.సాంబశివ రావు, విజరుకుమార్, శ్రీనివాస్ రావు, రవీందర్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## 9న నేషనల్ లోకాదలత్ సద్వినియోగం చేసుకోండి

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్

వికారాబాద్ – ప్రభాత సూర్యుడు

డిసెంబర్ 9న నిర్వహించే నేషనల్ లోకాదాలత్‌ను సద్వినియోగం చేసు కోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.సుదర్శన్ సూచించారు. సోమవారం బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద బీమా కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసేందుకు ఇన్సూరెన్స్ కంపెనీ ప్యానెల్ న్యాయవాదులు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలంగా కోర్ట్ లలో పెండింగ్ ఉన్న కేసుల్లో రాజీ కోసం ప్రయత్నం చేయాలన్నారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయితే కట్టిన కోర్ట్ ఫీజు తిరిగి ఇస్తామన్నారు. రాబోయే నేషనల్ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి డి.బి. శీతల్, జూనియర్ సివిల్ జడ్జి కే.శ్రీకాంత్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215